నమస్తే తెలంగాణ
కామారెడ్డి


## ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

**పద్మశ్రీ గరికపాటి నరసింహారావు**



గరికపాటిని సన్మానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 24 : పురాణాలు, ఇతిహాసాల ప్రేరణతో ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అన్నారు. జిల్లాకేంద్రంలోని పాత కలెక్టర్ మైదానంలో ధర్మబీజం కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గరికపాటి హాజరై ప్రవచనాలు చేశారు. రామాయణం భారతీయులకు మొదటి ఇతిహాసమని, ఒకే బాణం, ఒకే మాట, ఒకే పత్ని రాముడి జీవితం ఆదర్శమని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే మన పిల్లలకు సంస్కృతీ సంప్రదాయాలను నేర్పాలని సూచించారు. అనంతరం గరికపాటిని బీజేపీ నేతలు ఘనంగా సన్మానించారు.

## పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 24 : నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అర్హత కలిగిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు ఉద్యోగ, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్సెస్సీ అర్హత పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అధికారిణి శశికళ, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌గంగారాం తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో ఉన్న రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 5 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www.tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా మార్చి 6 లోగా రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. మార్చి 10న జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని, పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. 11 జిల్లా బ్రాంచ్‌లలో ఎక్కడైనా రెగ్యులర్ 5 నెలల ఫౌండేషన్ కోర్సు, రాష్ట్ర స్టడీ సర్కిల్ హైదరాబాద్ వద్ద సివిల్ సర్వీస్‌ల కోసం కోచింగ్ తీసుకున్న వారు అర్హులు కాదని తెలిపారు. మరిన్ని వివరాలకు 77021 75493, 99511 99460, 94905 11593 నంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

## లెండి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తిచేయాలి

**జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు**

**మహారాష్ట్ర నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష**



మహారాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, ఫిబ్రవరి 24: తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఉన్న సమస్యలు పరిష్కరించుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న లెండి ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తిచేసి జుక్కల్ నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం ఆయన కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మహారాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీలైనంత తొందరగా ప్రాజెక్టు పనులు పూర్తిచేసేందుకు అధికారులు సహకరించాలని కోరారు. ప్రాజెక్టు పనులు పూర్తయితే బిచ్కుంద, మద్నూర్, డొంగ్లీ మండలాల్లో 22వేల ఎకరాలు సాగులోకి వస్తాయని తెలిపారు.

## సాగర్ బ్యాక్ వాటర్‌లో విద్యార్థి గల్లంతు



మహేశ్ (ఫైల్)

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 24: నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో పశువులను కడగడానికి వెళ్లిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మొగులాన్‌ఖేడ్ గ్రామానికి చెందిన లైన్ మహేశ్ (15) ఎల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన అతడు పశువులను తీసుకుని నిజాంసాగర్ బ్యాక్ వాటర్ వద్దకు వెళ్లాడు. దుస్తులు తీసి ఒడ్డున పెట్టి, పశువులను కడిగేందుకు నీళ్లలోకి దిగి గల్లంతయ్యాడు. దూరం నుంచి చూసిన కొందరు గ్రామస్తులకు సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యులు, స్థానికులు వచ్చి నీటిలో గాలించినా ఫలితం లేకపోయింది.

## కామారెడ్డిలో అగ్నిప్రమాదం

**పాస్‌పోర్టు ఈ సేవా కేంద్రంలో షార్ట్ సర్క్యూట్**



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కామారెడ్డి, ఫిబ్రవరి 24: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హెడ్‌పోస్టాఫీస్‌లో ఉన్న పాస్‌పోర్టు ఈ సేవా కేంద్రంలో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘట నా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్ని ప్రమాదంలో కొన్ని డాక్యుమెంట్లు, సామగ్రి కాలిపోయిందని అధికారులు తెలిపారు. సేవా కేంద్రంలోని కార్యకలాపాలను సాంకేతిక కారణాలతో తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఫిబ్రవరి 26 నుంచి ఇప్పటికే అపాయింట్‌మెంట్స్ బుక్ చేసుకున్న దరఖాస్తుదారులకు రీషెడ్యూల్ కోసం ఎస్‌ఎంఎస్‌లు పంపిస్తామని పేర్కొన్నారు. నిజామాబాద్ పాస్‌పోర్టు సేవా కేంద్రంలో అదనపు అపాయింట్‌మెంట్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. తెలంగాణలోని పీఎస్కే, పీఓపీఎస్కేల్లో ఎక్కడైన రిషెడ్యూల్‌కు అవకాశం ఇస్తున్నట్టు చెప్పారు.

# చివరి తడికి కన్నీరే

**ఎన్నో ఆశలతో** యాసంగి వరిసాగుచేస్తున్న రైతు పరిస్థితి దయనీయంగా మారింది. ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలు రోజురోజుకూ అడుగంటుతున్నాయి. దీంతో భూములు నెర్రెలుబారి పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటివరకు ఎలాగో నెట్టుకొచ్చిన అన్నదాతకు చివరి తడిపై బెంగ మొదలైంది. రైతులకు పెట్టుబడి కూడా చేతికి రాని పరిస్థితి నెలకొన్నది. బోరుబావులు ఎత్తిపోయి పంటలకు నీరందక కండ్లముందే ఎండిపోతుండడంతో ఏం చేయాలో అర్థంకాక రైతులు తలలు పట్టుకుంటున్నారు. నెర్రెలుబారుతున్న నేలలను చూసి కన్నీరు పెడుతున్నారు.

–ధర్పల్లి/రామారెడ్డి/సిరికొండ, ఫిబ్రవరి 24

రామారెడ్డిలో ఎండిపోతున్న తుప్పతి పోచవ్వకు చెందిన వరి పొలం



- అడుగంటిన భూగర్భజలాలు
- సాగునీరందక నెర్రెలుబారుతున్న పొలాలు
- ఎండుతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు
- ఉమ్మడి జిల్లాలో రైతుల దయనీయ పరిస్థితి



ధర్పల్లి మండలం రేకులపల్లిలో నెర్రెలు బారిన వరి పంట చేను

నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని దుబ్బాక, రేకులపల్లి, వాడి తదితర గ్రామాల్లో వరి పంటలకు వారం రోజులగా నీటి తడులు అందడంలేదు. పంట ఎండిపోవడం చూసి తట్టుకోలేక వాడి గ్రామానికి చెందిన ఓ రైతు 500 ఫీట్ల మేర రెండు బోరుబావులు తవ్వించాడు. అయినా నీటి జాడలు కనిపించలేదు. అటు పంట పెట్టుబడికి, ఇటు బోర్ల కోసం లక్షల్లో ఖర్చుచేసి లబోదిబోమంటున్నాడు. దుబ్బాక గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డికి చెందిన వరి పొలం సైతం ఎండిపోతున్నది. ఇంత జరుగుతున్నా రైతులను పట్టించుకునేవారు కరువయ్యారు. వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించడం లేదు. కనీసం ధైర్యం చెప్పేవాళ్లు లేక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మరో 15 రోజులైతే పంటలు పూర్తిగా ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిరికొండ మండలంలోని తూంపల్లి, కొండాపూర్, గడ్కోల్, రామడ్గు, చిన్నవాల్గోట్, హుస్సేన్‌నగర్, కొండూర్, పెద్దవాల్గోట్, పోత్నూర్ రైతులు కప్పలవాగుపై నమ్ముకొని బోరుబావుల ద్వారా వరి సాగు చేస్తున్నారు. మైలారం, న్యావనంది, రావుట్ల రైతులు చెరువుల కింద సాగు చేస్తారు. పదేండ్లలో ఎన్నడూ లేనంతగా భూగర్భజలాల తగ్గిపోయి బోర్లు వట్టిపోతున్నాయి. ఫలితంగా పొట్ట దశలో ఉన్న వరి ఎండిపోతున్నది. కొందరు రైతులు పంటను కాపాడుకోవడానికి ట్యాంకర్ల ద్వారా పంటకు నీటిని అందిస్తున్నారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రలోనూ ఇదే దుర్భర స్థితి నెలకొన్నది. చాలా వరకు బోరుబావులు వట్టిపోతున్నాయి. దీనికి తోడు అనధికార కరెంటు కోతలు కూడా రైతులను భయపెడుతున్నాయి. ఎండలు ముదరకముందే యాసంగి పొలాలకు సరిగా నీరందడం లేదు. వేలల్లో పెట్టుబడి పెట్టి అప్పులపాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎవరూ పట్టించుకుంటలేరు..



యాసంగి వరి చేతికి రావాలంటే ఒకటి రెండు తడులకు నీరు కావాలె. కానీ, పరిస్థితి చూస్తే కాలం కలిసి వచ్చేటట్టులేదు. పంట మొత్తం ఎండిపోతున్నది. గతంలో ఎన్నడూ ఇంత అధ్వానంగా చూడలేదు. బోర్ల నుంచి చుక్క నీరు రావడంలేదు. మొన్నటి కాదా పచ్చగా ఏపుగా పెరిగిన మా పొలం ఎండిపోతున్నది. పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడంలేదు. ఇంతవరకు ఏ ఒక్క అధికారి వచ్చి చూడలేదు. ఆదుకునే ప్రయత్నం చేస్తలేరు. నాలాగ చాలా మంది రైతులు సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నరు.

–శేఖర్‌రెడ్డి, రైతు, దుబ్బాక, ధర్పల్లి మండలం

దుబ్బాక గ్రామంలో ఎర్రబడుతున్న శేఖర్‌రెడ్డికి చెందిన పొలం



# 'నిజాంషుగర్స్'కు పూర్వవైభవం తెస్తాం

- ఫ్యాక్టరీని తెరిపించి.. చెరుకు రైతుల అభ్యున్నతికి కృషిచేస్తాం
- కర్మాగారం లేఆఫ్‌ను పట్టించుకోని బీజేపీ నాయకత్వం
- నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు
- బోధన్‌లోని నిజాంషుగర్ ఫ్యాక్టరీని సందర్శించిన కమిటీ బృందం
- చెరుకు రైతులతో సమావేశం.. అభిప్రాయాల సేకరణ



బోధన్ షుగర్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న పునరుద్ధరణ కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు, సభ్యులు సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి తదితరులు

బోధన్, ఫిబ్రవరి 24: నిజాంషుగర్స్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి, చెరుకు రైతుల అభ్యున్నతికి కృషి చేస్తామని పునరుద్ధరణ కమిటీ చైర్మన్, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బోధన్ పట్టణంలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరణ కమిటీ శనివారం సందర్శించింది. ఫ్యాక్టరీలోని యంత్రాలు, పవర్ ప్లాంట్‌ను సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, షుగర్ కేన్ డైరెక్టర్ డాక్టర్ మల్సూర్‌తోపాటు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పరిశీలించారు. అనంతరం వారు చెరుకు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. కొందరు రైతులు చెరుకు సాగుపై తమ అభిప్రాయాలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నిజాం షుగర్స్ పునరుద్ధరణపై ఆచరణాత్మక కార్యచరణ కోసం రైతుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి వచ్చినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున చెరుకు పంట పండించడంతోపాటు అధిక దిగుబడులు సాధించినప్పుడు నిజాంషుగర్స్ లాభాల బాట పడుతుందని తెలిపారు. ఫ్యాక్టరీ ఆస్తులు, భూములపై బ్యాంకు రుణాలు ఉన్నాయని, వీటిని విడిపించడానికి ఏం చేయాలనే విషయమై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బోధన్ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నిజాంషుగర్స్‌ను 2015లో లేఆఫ్ ప్రకటించగా కేంద్రంలో అధికారంలో బీజేపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదన్నారు.

**రాయితీలు ఇవ్వండి: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి**

చక్కెర ఫ్యాక్టరీల మనుగడకు, చెరుకు ఉత్పత్తి పెరగడానికి రైతులు, చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యాలకు ప్రభుత్వం తరపున రాయితీలు ఇవ్వాలని నిజాం షుగర్స్ పునరుద్ధరణ కమిటీ సభ్యుడు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌ గాంధీ హన్మంతు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### చెరుకు దిగుబడి పెంచాలి

**బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి**

చక్కెర ఫ్యాక్టరీలు లాభాలు గడించాలన్నా, అధిక దిగుబడులు సాధించేలా ఆధునిక పద్ధతుల్లో రైతులు చెరుకు సాగు చేయాలని పునరుద్ధరణ కమిటీ సభ్యుడు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. అధిక దిగుబడిని ఇచ్చే చెరుకు వంగడాలపై పరిశోధనలు చేసి రైతులకు అందించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో చెరుకు రైతులు, చక్కెర ఫ్యాక్టరీలకు ఇబ్బందులు వస్తున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. నిజాంషుగర్స్‌కు మంచి రోజులు వచ్చాయని, త్వరలోనే ఫ్యాక్టరీ పునరుద్ధరణ జరిగి రైతులు, కార్మికుల కల నెరవేరుతుందన్నారు. ప్రస్తుతమున్న నిజాం షుగర్స్ మిల్లును తెరవాలా.. లేదా మరో చోట కొత్త టెక్నాలజీతో కొత్తగా మిల్లును ఏర్పాటుచేయాలన్న విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. బోధన్ ప్రాంతంలో కాలుష్య రహిత ఆహారశుద్ధి పరిశ్రమలు ఏర్పాటుచేయాలని మంత్రి శ్రీధర్‌బాబును ఆయన కోరారు.

## రైతులను అడ్డుకున్న పోలీసులు



నిజాంషుగర్ ఫ్యాక్టరీలోకి రైతులను వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్న సంఘటన చెరుకు రైతులను నిరాశకు గురిచేసింది. పునరుద్ధరణ కమిటీ సభ్యులు ఫ్యాక్టరీ లోపల చెరుకు రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించగా.. పలు గ్రామాల నుంచి రైతులు తరలివచ్చారు. వీరితోపాటు సీపీఐఎంఎల్ ప్రజాపంథా, సీపీఎం, ఇతర వామపక్షాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వచ్చారు. వీరందరినీ ఫ్యాక్టరీ లోపలికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వామపక్షాల నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగగా..చివరికి వారిని అనుమతించక తప్పలేదు. రైతులమైనా తమను అడ్డుకోవడం ఏంటని కొందరు ప్రశ్నించారు. అయితే, ముందుగా ఎంపికచేసిన రైతులనే లోపలికి అనుమతించాలని తమకు ఆదేశాలు ఉన్నాయని పోలీసులు బదులిచ్చారు.

## సారంగాపూర్ ఎన్‌సీఎస్‌ఎఫ్‌ను కూడా పునఃప్రారంభించండి

సారంగాపూర్, ఫిబ్రవరి 24 : నిజామాబాద్ నగర శివారులోని సారంగాపూర్ సహకార చక్కెర కర్మాగారాన్ని కూడా పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు శనివారం పునరుద్ధరణ కమిటీ చైర్మన్ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ఈ మేరకు వారు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డితో కలిసి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్‌సీఎస్‌ఎఫ్ పరిధిలో 23,216 మంది రైతులు చెరుకు ఉత్పత్తి చేస్తూ సభ్యులుగా ఉన్నారని, లాభాల బాటలో నడుస్తున్న ఫ్యాక్టరీని 2008లో అప్పటి ప్రభుత్వం మూసివేసిందని పేర్కొన్నారు. ఎన్‌సీఎస్‌ఎఫ్‌ను కూడా సబ్‌కమిటీలో చేర్చి పునఃప్రారంభించాలని కోరగా మంత్రి స్పందించి ఎన్‌సీఎస్‌ఎఫ్‌కు సంబంధించిన నివేదికను తనకు సమర్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.



మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడుతున్న రైతులు



కోటగిరి మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం సంబురాలు చేసుకున్నారు. ఎంపీపీ వల్లెపల్లి సునీతాశ్రీనివాస్‌రావు బీఆర్‌ఎస్‌ను వీడడంతో పార్టీకి పట్టిన శని పోయిందంటూ సంతోషం వ్యక్తంచేశారు.

–కోటగిరి, ఫిబ్రవరి 24

## పౌర హక్కులను హరించొద్దు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 24: పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించొద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. చట్టాలకు లోబడి పనిచేస్తేనే గ్రామాభివృద్ధి కమిటీలకు సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా కోర్టు కార్యాలయంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన వీడీసీలకు శనివారం న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. సంఘ బహిష్కరణలు తెలియకచేసినా నేరమేనని, వీడీసీల చర్యలు సమానత్వానికి గొడ్డలిపెట్టుగా మారకూడదని సూచించారు. చట్టవ్యతిరేక చర్యలు ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన కల్పించేందుకే సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



## కళ్లకు గంతలు కట్టుకొని అయోధ్యకు..

కామారెడ్డి, ఫిబ్రవరి 24: హైదరాబాద్ నుంచి కళ్లకు గంతలు కట్టుకొని బైక్‌లపై అయోధ్యకు బయల్దేరిన మారుతి జోషి, రామకృష్ణ అనే ఇద్దరు మెజీషియన్లు శుక్రవారం రాత్రి కామారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. వీరు శనివారం ఉదయం కామారెడ్డి నుంచి అయోధ్యకు బయల్దేరగా స్థానిక విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు, స్థానికులు అభినందించి సాగనంపారు. దశాబ్దాల కల నెరవేరిన సందర్భంగా అయోధ్య బాలరాముడిని దర్శించుకోవడానికి బయల్దేరినట్లు మెజీషియన్స్ తెలిపారు.